# ఆశీర్వదించండి..అండగా ఉంటా..

**• అంబర్‌పేటను మరింత తీర్చిదిద్దుతా • బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్**



రహత్‌నగర్‌లో ప్రచారంలో భాగంగా డప్పు కొడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, పాల్గొన్న నాయకులు

అంబర్‌పేట/కాచిగూడ, అక్టోబర్ 18: ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను మరోసారి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రజలను కోరారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని రహత్‌నగర్, న్యూవినాయకనగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్‌తో కలిసి కాలేరు తన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల మద్దతు కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, అండగా ఉంటానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన డప్పు కొడుతూ ఎన్నికల శంఖారావం పూరించారు. రహత్‌నగర్‌లో ముస్లింలు అధికంగా ఉన్నారని ప్రభుత్వం వారికోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని వివరించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పథకాలను ప్రజలు విశ్వసిస్తున్నారు.. : ఎమ్మెల్యే కాలేరు**

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు అమలు కావడంతో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎంతగానో విశ్వసిస్తున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సెంట్రల్ పీస్‌కమిటీ సభ్యుడు, ఈస్ట్‌జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శరత్‌శ్యామ్ ఆధ్వర్యంలో బుధవారం బర్కత్‌పుర హౌజింగ్‌బోర్డు ఎల్‌ఐజీహెచ్ కాలనీ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులంతా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ప్రజలంతా బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పరిపాలనకు జనం జేజేలు పలుకుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి పి.కిశోర్, టీ. వివేకానంద్, పి.వెంకటేశ్వర్ రెడ్డి, రాంచందర్, బాబు, పెంటం రమేశ్, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబురాలు

**• పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్**
**• మహిళలతో కలిసి ఆడిపాడిన కాలేరు**



ఫీవర్ దవాఖాన చౌరస్తాలో మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

అంబర్‌పేట/కాచిగూడ, అక్టోబర్ 18 : బీఆర్ఎస్ పార్టీ నల్లకుంట డివిజన్ ఆధ్వర్యంలో స్థానిక ఫీవర్ దవాఖాన చౌరస్తాలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండగను ప్రజలతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. దాండియా ఆడి అందరినీ ఉత్సాహ పరిచారు. ఈ నెల 19న అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో జరిగే బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బి.పద్మావెంకటరెడ్డి, ఇ.విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ, డాక్టర్ దీప్తిపటేల్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**దసరా ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు వినతి**

దసరా సందర్భంగా బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటలోని శ్రీమైసమ్మ అమ్మవారి ఉత్సవాలకు రావాలని సేవా సమితి అధ్యక్షుడు కోట్ల శివకుమార్ బుధ వారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, సుబ్రమణ్య శర్మ, గౌరీశంకర్, జయశంకర్, నరేశ్ పాల్గొన్నారు.

**కాచిగూడ జూనియన్ కళాశాలలో..**


తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలను నేటి యువ తరానికి తెలియజేయాలని కాచిగూడ ప్రభుత్వ జూనియన్ కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ స్వర్ణలత అన్నారు. స్థానిక కళాశాలలో బుధవారం అట్ల బతుకమ్మ వేడుకలను విద్యార్థినులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విదేశాల్లో తెలంగాణ సంస్కృతి చాటిచెప్పేందుకు బతుకమ్మ వేడుకలు దోహద పడుతాయన్నారు. కార్యకమంలో గీత, రాధిక, రజినీ, సీనియర్ లెక్చరర్ వి.ప్రసాద్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్య గంగపుత్ర, తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడిన కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు, సిబ్బంది

# భక్తిశ్రద్ధలతో దసరా నవరాత్రి ఉత్సవాలు

అంబర్‌పేట, అక్టోబర్ 18: నియోజకవర్గంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట తదితర డివిజన్లలో నెలకొల్పిన అమ్మవారి మండపాల వద్ద ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. నాలుగో రోజు అంబర్‌పేట మహంకాళి అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమించారు. సామూహిక కుంకుమార్చన, హోమాలు నిర్వహించారు. గ్రేట్ ఇండియా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లకుంటలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. బతుకమ్మకుంట శ్రీమైసమ్మ అమ్మవారు భక్తులకు శ్రీలలితాదేవిగా దర్శనమిచ్చారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ పోచమ్మబస్తీలో నెలకొల్పిన అమ్మవారి మండపం వద్ద మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో అసోసియేషన్ సభ్యులు చెన్నబోయిన శివయాదవ్, చైతన్యకుమార్, సోమసుందర్, సేవా సమితి చైర్మన్ కోట్ల శివకుమార్, బీఆర్ఎస్ నాయకుడు సాధినేని నవీన్‌కుమార్, యాదగిరిరాజు, రాఘవేందర్, నర్సింగ్, భాస్కర్‌గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నపూర్ణాదేవిగా అంబర్‌పేట మహంకాళి అమ్మవారు



పోచమ్మబస్తీలో నెలకొల్పిన అమ్మవారిని దర్శించుకున్న మాజీ కార్పొరేటర్ కె.పద్మావతీడీపీరెడ్డి



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

**19న ఫీవర్ దవాఖానలో బతుకమ్మ వేడుకలు**

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 19 న నల్లకుంట ఫీవర్ దవాఖానలో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నట్లు టీఎం అండ్ హెచ్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జలిగామ అశోక్, ఫీవర్ దవాఖాన యూనిట్ అధ్యక్షురాలు లావణ్య బుధవారం విలేకరులకు తెలిపారు. ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఎన్నికల నిబంధనలు పాటించాలి..



బర్కత్‌పురలో తనిఖీలు చేస్తున్న కాచిగూడ ఎస్ఐ సుభాష్, సిబ్బంది

కాచిగూడ, అక్టోబర్ 18: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, నాయకులు, ప్రజలు, వాహనదారులు నిబంధనలు పాటించాలని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎస్ఐ డి.సుభాష్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం బర్కత్‌పుర చమాన్‌లో తనిఖీలు చేపట్టారు. కాచిగూడ, బర్కత్‌పుర రోడ్డుపై అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని పోలీసులు అపి తనిఖీలు చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో లావాదేవీల వివరాలు లేకుండా అధిక మొత్తంలో నగదును తరలిస్తే సీజ్ చేస్తామని సూచించారు. వ్యక్తిగతంగా రూ. 50 వేలకు మించి వాహనాల్లో తీసుకెళ్లినా స్వాధీనం చేసుకుంటా మని పేర్కొన్నారు. లావాదేవీల వివరాలను సంబంధిత అధికారులకు అందించి వాటిని పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆయన వెంట కాచిగూడ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

**రౌడీషీటర్స్‌కు కౌన్సిలింగ్..**

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానమేనని, చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రౌడీషీటర్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఎస్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు చట్టానికి లోబడి నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై హెచ్.నరేశ్ పాల్గొన్నారు.

## బీజేపీకి ఇరువురు రాజీనామా




బీజేపీకి రాజీనామా చేసిన నాయకులు విజయ్‌కుమార్, అనిల్‌రామ్

అంబర్‌పేట, అక్టోబర్ 18 : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌కు చెందిన ఇరువురు బీజేపీ నాయకులు బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. గత 45 సంవత్సరాలుగా పార్టీలో పని చేస్తున్నప్పటికీ సరైన గుర్తింపు లేదని, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బాగ్‌అంబర్‌పేట డివిజన్ ఉపాధ్యక్షుడు ఎం.విజయ్‌కుమార్ ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.గౌతంరావుకు పంపించారు. అదేవిధంగా పార్టీ యువమోర్చా ప్రధాన కార్యదర్శి సి.అనిల్‌రామ్ సైతం పార్టీకి రాజీనామా చేశారు. త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు వారు పేర్కొన్నారు.

## నియామకం



టి.బలరాములు చారి

గోల్నాక, అక్టోబర్ 18 : ఆల్ ఇండియా శ్రీ విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ అంబర్‌పేట నియోజవర్గ కార్పెంటర్ వింగ్ అధ్యక్షుడిగా పటేల్‌నగర్‌కు చెందిన తాటోజి బలరాములు చారి నియమితులయ్యారు. బుధవారం అంబర్‌పేటలోని ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌చార్జి మాదారపు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి సేనా లక్ష్మణచారి, జాతీయ కార్యదర్శి జగదీశన్ ఆచారి బలరాములుచారికి నియామక పత్రం అందజేశారు. లక్ష్మణాచారి, సింగోజి నరేందర్, అంబర్‌పేట డివిజన్ ప్రధాన కార్యదర్శి డి.ఎల్లయ్యాచారి, డివిజన్ ఉపాధ్యక్షులు అర్నాజి జైన్‌కుమార్‌చారి పాల్గొన్నారు.

## బతుకమ్మ వ్యాప్తికి ఎమ్మెల్సీ కవిత కృషి

కాచిగూడ,అక్టోబర్ 18: బతుకమ్మ పండుగను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విశేష కృషి చేశారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోనె ప్రదీప్‌రావు అన్నారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బతుకమ్మ పండుగను నిర్లక్ష్యం చేశాయన్నారు. ఎమ్మెల్సీ కవిత కృషితోనే బతుకమ్మకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు వచ్చినట్లు పేర్కొన్నారు. మహిళలను జాగృతం చేయడంలో ప్రధాన పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు.